

ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు సస్పెన్షన్

ఇచ్ఛాపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నిధులు దుర్వినియోగం, రికార్డులు తారుమారుకు పాల్పడిన మండపల్లి పంచాయతీకి చెందిన ఇద్దరు పూర్వ కార్యదర్శులను సస్పెండ్ చేశామని ఎంపీడీవో ప్రభాకరరావు తెలిపారు. ప్రస్తుత బూర్జపాడు పంచాయతీ కార్యదర్శి ఎస్.కృష్ణ, లొద్దపుట్టి పంచాయతీ కార్యదర్శి జి.గురుమూర్తి గతంలో మండపల్లిలో పంచాయతీ కార్యదర్శులుగా విధులు నిర్వహించారు. అప్పట్లో రికార్డుల్లో అవకతవకలకు పాల్పడంతోపాటు ఆర్థిక వ్యవహారాల్లో తేడాలు రావడంతో జిల్లా పంచాయతీ అధికారి భారతీ సౌజన్య వారిద్దరినీ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని ఎంపీడీవో తెలిపారు.

గతి తప్పిన నాగావళి

- నదీ గర్భంపై రొయ్యల పంజా
- అక్రమార్కుల దాహానికి బలైపోతున్న తీరం
- గత పాలకుల అండతోనే ఇసుక, ఆక్వా మాఫియా విధ్వంసం
- ఇప్పుడు సరిచేయాలంటే రూ.98కోట్లు అవసరం



పెద్దగనగళ్లవానిపేట వద్ద కోతకు గురైన సముద్ర తీరం



నాగావళి నదిలో ఇసుక తవ్వకాలతో మార్గం ఏర్పడి సముద్రంలో కలుస్తున్న నీరు (ఫైల్)

శ్రీకాకుళం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):

జిల్లాలో నాగావళి నది గతి మారుతోంది. సముద్రం ముంచుకొస్తోంది. నదీ సంగమ ప్రదేశం ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. ఇది ప్రకృతి వైపరీత్యం కాదు.. పక్కా మానవ తప్పిదం. వైసీపీ పాలనలో అక్రమార్కులు సాగించిన విధ్వంసానికి సాక్ష్యం. కాసుల కక్కుర్తి కోసం నదీ గర్భాన్ని చెరబట్టి రొయ్యల చెరువులుగా మార్చేశారు. మరికొందరు ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా చేపట్టారు. దీంతో ఇప్పుడు ఆ నది ఆగ్రహించి ఊళ్ల మీదకు దూసుకొస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఇసుక, ఆక్వా మాఫియా ఆడిన వికృత క్రీడకు శ్రీకాకుళం మండలం పెద్దగన గళ్లవానిపేట వంటి గ్రామాలు ఇప్పుడు మూల్యం చెల్లించుకుంటున్నాయి.

నది మలుపు తిరిగి.. సంద్రం ముందుకొచ్చి..

బొంతలకోడూరు వద్ద బంగాళాఖాతంలో కలవాల్సిన నాగావళిని.. అక్రమార్కులు తమ స్వార్థం కోసం అడ్డుకున్నారు. పెద్దగనగళ్లవానిపేట పరిధిలోని సర్వే నంబర్ 106లో దాదాపు 80 ఎకరాల విస్తీర్ణంలో 46 రొయ్యల చెరువులు అనధికారికంగా వెలిశాయి. నాగావళి నది సముద్రంలో కలిసే ముఖద్వారాన్ని పూడ్చేసి ఇసుక తవ్వకాలు చేసి చెరువులను విస్తరించారు. దీంతో నీరు వెళ్లే దారిలేక నాగావళి నది ఏకంగా 90 డిగ్రీలు ఒంపు తిరిగిపోయింది. ఫలితంగా నదీ ప్రవాహం నేరుగా పెద్దగనగళ్లవానిపేట వైపు మళ్లింది. నాగావళి నది గతి మారడంతో సముద్రం కూడా తన ప్రతాపం చూపిస్తోంది. అలల తాకిడికి తీరం కోతకు గురై.. సముద్రం దాదాపు 200మీటర్లు ముందుకు చొచ్చుకువచ్చింది. ఇటీవల నిర్మించిన బీచ్ రోడ్డు కోతకు గురవ్వడమే కాకుండా.. రక్షణగా ఉన్న చెట్లు కూడా నేలకొరిగాయి. ఏ మాత్రం వరద వచ్చినా పెదగనగళ్లపేట గ్రామం జలదిగ్బంధం అయ్యే ప్రమాదం పొంచి ఉంది.

- నది గమనం ఒక్కసారి మారాక దాన్ని మళ్లీ సరిచేయడం ఆషామాషీ కాదు.. గైడ్ బండ్స్.. నదిని సముద్రం వైపు మళ్లించడానికి భారీ రాళ్లతో నీటిలో గట్లు నిర్మించాలి. డ్రెడ్జింగ్.. పూడిపోయిన ముఖద్వారాన్ని తెరవడానికి భారీ యంత్రాలతో ఇసుకను తొలగించాలి. తీర రక్షణ.. సముద్రం గ్రామం మీదకు రాకుండా పటిష్ఠమైన రక్షణ గోడలు కట్టాలి. దీనంతటికీ కలిపి దాదాపు రూ.98 కోట్లు అవుతుందని జలవనరుల శాఖ అంచనా.

గత పాపం.. నేటి శాపం

'మా ఊరు మునిగిపోతోంది మహాప్రభో' అని స్థానికులు మొత్తుకున్నా గత వైసీపీ పాలకులు, అధికారులు ఏనాడూ పట్టించుకోలేదు. అక్రమార్కుల నుంచి ముడుపులు అందాయో.. లేక వారి అండదండలు (మిగతా 6వ పేజీలో..)

కొత్త చట్టాలపై అవగాహన అవసరం

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఘట్టమనేని రామకృష్ణ ప్రసాద్

శ్రీకాకుళం లీగల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కొత్త క్రిమినల్ చట్టాలపై న్యాయమూర్తులు, న్యాయవాదులకు సమగ్ర అవగాహన అవసరమని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఘట్టమనేని రామకృష్ణ ప్రసాద్ తెలిపారు. శనివారం శ్రీకాకుళంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో క్రిమినల్ చట్టాలపై కార్యశాలను ఆయన ప్రారంభించారు. అందరికీ ఒకేలా న్యాయం అందించడంలో న్యాయమూర్తులు, న్యాయవాదుల సమష్టి కృషి అవసరమని తెలిపారు.

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఘట్టమనేని రామకృష్ణ ప్రసాద్‌ను జిల్లా బార్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. జిల్లాకోర్టులో నెలకొన్న పలు సమస్యలను హైకోర్టు న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారని జిల్లా బార్ అసోసియే షన్ అధ్యక్షుడు తంగి శివప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో కార్యశాల రిసోర్స్ పర్సన్స్ ఏవీ పార్థసారథి, యు.సత్యారావు, జిల్లా న్యాయాధికారి జునైద్‌అహ్మద్ మౌలానా, జిల్లా అదనపు న్యాయాధికారులు పి.భాస్కరరావు, వివేకానంద శ్రీని వాస్, ఎస్.ఎం.ఫణికుమార్, తిరుమలరావు, పోక్సో న్యాయాధికారి నక్క సుజాత, సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.శ్రీధర్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయా ధికారి కె.అనురాగ్, అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి జమృతబేగం, జిల్లాబార్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి పిట్టా దామోదర్, ఉపాధ్యక్షులు సీతరాజు, మహిళా ప్రతినిధి గురుగుబెల్లి వనజాక్షి తదితరులు పాల్గొన్నారు.



జస్టిస్ రామకృష్ణ ప్రసాద్‌ను కలిసిన బార్ అసోసియేషన్ ప్రతినిధులు



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు, పక్కన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యేలు గొండు శంకర్, గౌతు శిరీష

సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం

- వైసీపీ పాలనలో ఒక్క పైసా కూడా ఖర్చు చేయలేదు
- జూన్ నాటికి ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు 75 శాతం పూర్తిచేస్తాం
- రబీలో ఆరుతడి పంటలు సాగుచేయాలి: మంత్రి అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): 'వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోంది. సాగునీటి ప్రాజెక్టులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామ'ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. వైసీపీ పాలనలో జిల్లాలో ప్రాజెక్టులకు ఒక్క పైసా కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. శనివారం జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలసి జిల్లా నీటిపారుదల సలహా మండలి సమావేశాన్ని నిర్వహించారు. ప్రాజెక్టుల వారీగా పలు అంశాలపై చర్చించారు. రబీ సీజన్‌లో వరి పంట సాగుకు తగినంత నీరు అందకపోవడంతో ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు వేసుకోవాలని మంత్రి రైతులకు సూచించారు. 'గత వైసీపీ ప్రభుత్వం వంశధార కుడికాలువపై లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును మినహా ఇతర ప్రాజెక్టులను పట్టించుకోలేదు. జిల్లాలో అన్ని ప్రాజెక్టులకు అవసరమైన నిధులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. వంశధార, నాగావళి అనుసంధానం, వంశధార ప్రాజెక్టు నిర్మాణ పనులు, ఆఫ్‌షోర్ ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వచ్చే జూన్ నాటికి ఆఫ్‌షోర్ ప్రాజెక్టు పనులకు 75 శాతం పూర్తి చేస్తాం. సాంకేతిక సమస్యలున్న నేరేడి బ్యారేజీ మినహా ఇతర ప్రాజెక్టులను ప్రాధాన్య క్రమంలో తిరిగి ప్రారంభిస్తున్నాం. నారాయణపురం ఆనకట్ట ఆధునికీకరణకు గడిచిన ప్రభుత్వంలో నిలిచిపోయిన జైకా నిధులను తిరిగి పునరుద్ధరించుకుని పనులు మొదలుపెట్టాం. పూర్వోదయం పథకం కింద రూ.60వేల కోట్లు ప్రాజెక్టుల రూపకల్పనకు కేంద్ర ప్రభుత్వ అనుమతి కోరాం. అందులో ఉత్తరాంధ్రకు అత్యధిక ప్రాధాన్యం లభించింది. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ఇది మంచి అవకాశమ'ని మంత్రి వెల్లడించారు. వంశధార షట్టర్ల సమస్యపై సీఐడీ (మిగతా 6వ పేజీలో..)

అధికారులూ..
రికార్డులు చూసుకోరా?
- నదుల అనుసంధానానికి ఎంత భూమి పెండింగ్ ఉంది?
- ఇటువంటివారితో చేయలేం: పీయూసీ చైర్మన్ కూన రవి ఆగ్రహం
6లో

అక్కడ చదివితే 'నవోదయ'మే!
- ఆరో తరగతిలో ప్రవేశానికి 13న పరీక్ష
- సీటు సాధిస్తే ఉజ్వల భవిష్యత్తు
అంతర్‌వర్సిటీ వాలీబాల్ విజేత
శ్రీకాకుళం జట్టు
6లో

హోంగార్డుల సేవలు కీలకం

- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసుశాఖలో హోంగార్డుల సేవలు కీలకమని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ప్రసంశించారు. శనివారం శ్రీకాకుళం మండలం తండేం వలసలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం మైదానంలో ఘనంగా 63వ హోంగార్డు ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీకి హోంగార్డులు గౌరవ వందనం సమర్పించారు. కమాండర్ హోంగార్డు శశిభూషణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైజింగ్ పరేడ్‌ను ఎస్పీ పరిశీలించారు. శాంతిచిహ్నంగా బెలూన్లు, పావురాలను ఎగురవేశారు. ఎస్పీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ... '1962లో కొద్దిమందితో స్వచ్ఛందంగా ఏర్పడిన హోంగార్డు ఆర్గనైజేషన్ సేవలు క్రమేపీ పెరిగాయి. ప్రస్తుతం జిల్లాలో 699 మంది హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారు. పోలీసులతో సమానంగా సేవలు అందిస్తున్న హోంగార్డుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. వేతనాలను పెంచే ఆలోచనలో ఉంది. ఆరోగ్య, ప్రమాద బీమా సదుపాయాలకు కార్యాచరణ సిద్ధం చేశాం. ప్రతి నెల ఇచ్చే రెండు రోజుల విశ్రాంతి సెలవులతో పాటు అత్యవసర పరిస్థితుల్లో సెలవులు పొందే అవకాశం కూడా కల్పించామ'ని తెలిపారు. సమస్యలు ఉంటే తమను సంప్రదిస్తే వాటి పరిష్కారానికి (మిగతా 6వ పేజీలో..)



పరేడ్ కమాండర్‌కి బహుమతి ప్రదానం చేస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి



అంబేద్కర్‌కు ఘన నివాళి

శ్రీకాకుళం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేద్కర్.. విశ్వమే గర్వించదగ్గ మానవుడని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కొనియాడారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం అంబేద్కర్ వర్థంతి నిర్వహించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యేలు గొండు శంకర్, గౌతు శిరీష, సాగునీటి ప్రాజెక్టు చైర్మన్‌లతో కలసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలను వేసి మంత్రి అచ్చెన్న నివాళి అర్పించారు. భారత రాజ్యాంగ రూపకర్తగా అంబేద్కర్ అందించిన అత్యున్నత సేవలను స్మరించుకున్నారు. సామాజిక న్యాయ స్థాపన కోసం జీవితాంతం పోరాడిన స్ఫూర్తిదాయక వ్యక్తిత్వం అంబేద్కర్ సొంతమని మంత్రి అచ్చెన్న పేర్కొన్నారు.

వరుస దొంగతనాలు..
ఛేదించిన పోలీసులు
- నాలుగు చోరీ కేసుల్లో వ్యక్తి అరెస్టు
- 78 గ్రాముల బంగారం, 38 గ్రాముల వెండి, నగదు స్వాధీనం
8లో

మూడు నెలలుగా డీఎస్పీ లేరు

- ఇన్‌చార్జి అధికారితోనే నడిపిస్తున్న వైనం
- కీలకమైన కాశీబుగ్గ డివిజన్‌లో ఇదీతీరు
- 'ఎస్‌డీపీవో' ఎత్తివేస్తారంటూ ప్రచారం

పలాస, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రం తర్వాత అత్యంత ప్రాధాన్యత కలిగిన కాశీబుగ్గ సబ్‌డివిజన్ పోలీసు కార్యాలయాన్ని (ఎస్‌డీపీవో) పట్టించుకునే నాథులు కరువయ్యారు. ఈ కార్యాలయంలో మూడునెలల నుంచి డీఎస్పీ పోస్టు నియమించలేదు. టెక్కలి డీఎస్పీ లక్ష్మణరావుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అక్కడ నుంచే విధులు నిర్వహిస్తూ అత్యవసర పరిస్థితుల్లో ఆయన ఇక్కడ కార్యాలయం పనులు చక్కదిద్దుతున్నారు. ప్రస్తుతం పూర్తిస్థాయి డీఎస్పీ లేకపోవడంతో కార్యాలయం సిబ్బంది ఒక్కొక్కరికీ ఇతర డ్యూటీలు వేశారు. దీంతో ఇక్కడ ఒక్కరు మాత్రమే విధులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. ఈక్రమంలో ఈ కార్యాలయం ఎత్తివేస్తారనే ప్రచారం సాగుతోంది.



కాశీబుగ్గ సబ్‌డివిజన్ పోలీసు కార్యాలయం

- శ్రీకాకుళం జిల్లా ఏర్పడినప్పటి నుంచి పోలీసు విధులు సులభతరం చేసేందుకు జిల్లాకేంద్రానికి సమాంతరంగా కాశీబుగ్గ సబ్‌డివిజన్ పోలీసు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గతంలో అద్దెభవనాల్లో నిర్వహించిన కార్యాలయం కాశీబుగ్గ పోలీసు మైదానంలో నిర్మించిన భవనంలోకి మార్చారు. గతంలో డీఎస్పీకి బదిలీ అయితే ఒక్క రోజులోనే (మిగతా 6వ పేజీలో..)

అక్కడ చదివితే నవోదయమే!

- ఆరో తరగతిలో ప్రవేశానికి 13న పరీక్ష
- సీటు సాధిస్తే ఉజ్వల భవిష్యత్తు
- సాధనతో మంచి మార్కులు



జవహర్ నవోదయ... ఎంతోమంది కలలు కనే విద్యా ప్రపంచం. ఎంతోమందిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దిన విద్యాలయం. ఒక్కసారి సీటు వస్తే చాలు... విద్యార్థి భవిష్యత్తుకు ఢోకా ఉండదని భరోసా ఇచ్చే పాఠశాల.

నరసన్నపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి)

జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఈనెల 13న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ పరీక్ష రాసేందుకు జిల్లాలో 7,936 మంది దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో 30 కేంద్రాలను... పార్వతీపురం మన్యం జిల్లాలోని పాలకొండలో 3, వీరఘట్టంలో రెండు కేంద్రాలను కేటాయించారు. ఈ పరీక్షకు ప్రశ్నపత్రం ఎలా ఉంటుంది? రాసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు పరిశీలిద్దాం.

ఎక్కడ ఉందంటే..

జిల్లాలోని సరుబుజ్జిలి మండలం వెన్నలవలసలో నవోదయ పాఠశాలను 1988లో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు అక్కడ ఉచిత విద్యను అందిస్తారు. కార్పొరేట్ పాఠశాలల స్థాయి వసతుల మధ్య నిపుణులైన ఉపాధ్యాయులు బోధిస్తారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు వంటివి నిర్వహిస్తారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఈ పాఠశాల ఉంటుంది. ఇంటర్‌లో ఎంబైపీసీ చదివే అవకాశం ఈ పాఠశాలలోనే ఉంది.

మూడు విభాగాల్లో పరీక్ష..

ప్రవేశ పరీక్ష రెండు గంటలు కొనసాగుతుంది. వంద మార్కులకు వంద ప్రశ్నలతో ప్రశ్నపత్రం ఉంటుంది. మూడు విభాగాలలో ఈ ప్రశ్నలు ఉంటాయి. ప్రతి విభాగంలో ఐచ్ఛిక ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు ఉంటుంది. రీజనింగ్ మేథాశక్తిలో 50 మార్కులకు 40 ప్రశ్నలు, గణితంలో 25 మార్కులకు 20 ప్రశ్నలు, తెలుగు భాష పరీక్షలో ఐదు అంశాలలో ఒక్కో అంశానికి నాలుగు మార్కుల చొప్పున 25 మార్కులు ఉంటాయి. ఇంగ్లీషు, తెలుగు మీడియం విద్యార్థులకు వేర్వేరుగా పరీక్ష ఉంటుంది.

ఎక్కువ మార్కులు ఏ విభాగంలో అంటే..

మేథాశక్తి విభాగంలో 40 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కొక్క ప్రశ్నకు 1.25 మార్కుల చొప్పున మొత్తం 50 మార్కులు ఉంటాయి. విద్యార్థులలోని మేథాశక్తిని వెలికితీసేలా ఇవి ఉంటాయి. బొమ్మలతో కూడిన ప్రశ్నలు ఉంటాయి. ప్రశ్న కింద నాలుగు సమాధానాలు బొమ్మల రూపంలో ఉంటాయి. ఈ ప్రక్రియలో సులభంగా మార్కులు పొందడానికి విద్యార్థులు సమయస్ఫూర్తితో ఆలోచించాల్సి ఉంటుంది. జాగ్రత్తగా బొమ్మలను గమనిస్తే తక్కువ సమయంలోనే సమాధానాలను గుర్తించవచ్చు. నవోదయ దరఖాస్తుతో పాటు పంపిణీ చేసిన సమాచార ప్రతిలో విభాగానికి చెందిన నమూనా ఉంటుంది. దీన్ని పరిశీలించి శ్రద్ధగా అభ్యాసం చేస్తూ ఈ విభాగంలో సులువుగా 45 వరకు మార్కులు పొందే అవకాశం ఉంది.

గణితంలో ఇలా..

గణిత విభాగంలో 20 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు 1.25 మార్కు వంతున 25 మార్కులు ఉంటాయి. ఐదో తరగతి వరకు గల అన్ని చాప్టర్లలో ఒకటి లేదా రెండు చొప్పున ప్రశ్నలు అడుగుతారు. గణితంలో అధిక మార్కులు సంపాదించగలిగే విద్యార్థులు దాదాపుగా నవోదయలో సీటు పొందుతారు. సులభంగా మార్కులు సాధించేందుకు ప్రధాన గణిత సూత్రాలు నేర్చుకోవాలి. అంతేకాక 5 అంశాల ఆధారంగానే 25 ప్రశ్నలు ఉంటాయి.

భాష పరీక్ష ఇలా..

విద్యార్థుల భాషా పఠనాశక్తిని అంచనా వేసేందుకు ఈ పరీక్ష నిర్వహిస్తారు. ఈ ప్రశ్నలు 25 మార్కులకు ఉంటాయి. ఈ విభాగంలో ఐదు పాఠ్యాంశాలు ఇస్తారు. ఒక్కో పాఠ్యాంశంలో నాలుగు ప్రశ్నల వంతున ఐదు పాఠ్యాంశాలలో 25 మార్కులు ఉంటాయి. పాఠ్యాంశాల ఆధారంగా ఇచ్చే ప్రశ్నలకు సమాధానాలు అన్నీ ఒకేలా ఉంటాయి. నిశితంగా గమనిస్తే సమాధానం కచ్చితంగా గుర్తించేందుకు వీలవుతుంది.

ఈ సూచనలు పాటించండి..

- పరీక్షకు వెళ్లేటప్పుడు హాల్‌టిక్కెట్, ప్యాడ్, నీలం, నలుపు రంగు పెన్నులు తీసుకువెళ్లాలి.
- ప్రశ్నపత్రంలో అన్ని పేజీలు ప్రింట్, క్రమసంఖ్య, మీడియం సరిగా ఉన్నాయో లేదో చూసుకోవాలి.
- పరీక్ష కేంద్రానికి అర్ధగంట ముందుగా వెళ్లాలి.
- జవాబు పత్రాన్ని ఒకటికి రెండుసార్లు జాగ్రత్తగా గమనించాలి. పేరు, హాల్ టిక్కెట్ నెంబర్ రాయాలి.
- జవాబు పత్రంలో ఎంచుకున్న సంఖ్యను బాక్సులో మధ్యలో సరిగా కనిపించేలా రాయాలి.
- జవాబు పత్రంలో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.
- కచ్చితంగా ప్రతి విభాగంలోనూ ఉత్తీర్ణులు కావాలి.



విద్యార్థుల విన్యాసం

ఉన్నత ప్రమాణాలతో..

ఆరో తరగతిలో చేరేందుకు 80 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వాటిలో 75 శాతం గ్రామీణ ప్రాంతం వారికి, 25 శాతం నగర వాసులకు కేటాయించారు. ప్రవేశ పరీక్షలో ప్రతిభ చూపి సీటు సాధిస్తే... వారి భవిష్యత్తు ఎంతో ఉజ్వలంగా ఉంటుంది. ఉన్నత ప్రమాణాలతో విద్యాబోధనతో పాటు క్రీడలపై ప్రత్యేక దృష్టి, కార్పొరేట్ స్థాయి వసతులు ఉంటాయి.

సీటు సాధిస్తే మంచి భవిష్యత్తు..

జవహర్ నవోదయలో సీటు వస్తే జీవితంలో ఏదో ఒక రంగంలో స్థిరపడవచ్చును. విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలోనూ శిక్షణ ఇస్తారు. నేను అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు నవోదయలోనే పునాది పడింది. 28 ఏళ్ల క్రితం వెన్నలవలసలో చదివాను.

-సాధు శిబిచక్రర్తి, ఐఏఎస్ అధికారి, నవోదయ పూర్వ విద్యార్థి

ఏర్పాట్లు పూర్తి చేశాం..

జిల్లాలో ఈనెల 13న 35 కేంద్రాల్లో నవదోయ పరీక్ష నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. మాస్ కాపీయింగ్‌ను నిరోధించేందుకు సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమిస్తున్నాం. ఎంఈవోల ఆధ్వర్యంలో ప్రశాంతంగా పరీక్ష నిర్వహించేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

-బి.బేతన్ సాహు, ప్రిన్సిపాల్, జవహర్ నవోదయ, వెన్నెలవలస

రబీ ఆశలు ఆ'వరి'

- సాగుకు నీరు కష్టమే..



నందిగాం మండలంలో రబీకి వరినారు సిద్ధం చేస్తున్న దృశ్యం

టెక్కలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది నీటి వనరులు పుష్కలంగా ఉండడంతో రైతులు రబీ వరిపై ఆసక్తి చూపారు. అందులో భాగంగా నందిగాం, టెక్కలి, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, సారవకోట, జలుమూరు, హిరమండలం, పాతపట్నం తదితర మండలాల్లోని సుమారు 25వేల హెక్టార్లలో రైతులు రబీలో వరి సాగు చేసేందుకు సిద్ధపడ్డారు. రబీ సీజన్‌లో సాగునీరు విడిచిపెట్టడం కష్టమని... ఆరుతడి పంటలైన వేరుశనగ, రాగులు, మినుము, పెసర, మొక్కజొన్న వంటివి పండించుకోవాల్సిందేనని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శనివారం జరిగిన నీటి పారుదల సలహా మండలి సమావేశంలో సూచించారు. దీంతో రబీ రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది చెరువులు, వాగులు, గెడ్డలు, కాలువల్లో ప్రస్తుతం సాగు నీరు ఉండడంతో మార్చి నెలాఖరు వరకు సాగునీరు అందితే చాలని రైతులు భావిస్తున్నారు. ఇప్పటికే ఆ మండలాల్లో నారుమడులను పూర్తి స్థాయిలో సిద్ధం చేశారు. ఈ ఏడాది గొట్టాబ్యారేజ్ పరిధిలో పూర్తిస్థాయిలో నీరు ఉండడంతో కాలువల నీరు వస్తుందని ఆశపడిన రైతులు నీటి పారుదల సలహా మండలి సమావేశం తరువాత ఏం చేయాలో తోచక తలలు పట్టుకుంటున్నారు. ఖరీఫ్‌లో వరి సాగుకు వ్యయప్రయాసలకు గురికావాల్సి వస్తోందని అంటున్నారు. రబీలో వరిసాగు ఆశాజనకంగా ఉంటుందని... అందుకే అటువైపు మొగ్గు చూపుతున్నామని రైతులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి మాటలతో ఏం చేయాలో తెలియని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

గతి తప్పిన నాగావళి

(ఐదో పేజీ తరువాయి)

ఉన్నాయో కానీ.. ఫిర్యాదులను బుట్టదాఖలు చేశారు. కనీస చర్యలు తీసుకోకపోవడం వల్లే నేడు పరిస్థితి ఇంత ప్రమాదకరంగా మారింది. అప్పుడే బాధ్యతతో వ్యవహరించి ఆ 80 ఎకరాల్లో అక్రమ రొయ్యల చెరువులకు, నదిలో ఇసుక తవ్వకాలకు అడ్డుకట్ట వేసి ఉంటే ఈ దుస్థితి వచ్చేది కాదు. ఇది ముమ్మాటికీ గత పాలకుల అలసత్వమేనని ప్రస్తుత ప్రజాప్రతినిధులు మండి పడుతున్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఇప్పుడు రూ.98 కోట్లు వెచ్చించాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. ఈ నిధులతో ఒక ప్రాజెక్టో.. వంతెనో.. ఆస్పత్రి లేదా ఎన్నో రోడ్లు నిర్మించవచ్చు. పాఠశాలలు బాగు చేయొచ్చు. కానీ కొందరి స్వార్థానికి, గత పాలకుల పాపానికి.. ఈ నిధుల భారం తమపై పన్నుల రూపంలో పడుతోందని సామాన్యులు నిటూర్చుతున్నారు. ఇది ముమ్మాటికీ 'ప్రజల సొమ్ము గంగపాలు' చేయడమేనని పలువురు పేర్కొంటున్నారు.

వాలీబాల్ విజేత శ్రీకాకుళం జట్టు

ఎచ్చెర్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీ (ఆర్జీయూకేటీ) పరిధిలోని శ్రీకాకుళం క్యాంపస్‌లో నిర్వహించిన అంతర వర్సిటీ పోటీలు శనివారంతో ముగిశాయి. ఈ క్యాంపస్‌లో మూడు రోజుల పాటు వాలీబాల్, చెస్ పోటీలు నిర్వహించారు. వాలీబాల్ బాలికల కేటగిరీలో శ్రీకాకుళం క్యాంపస్ జట్టు ప్రథమ, నూజివీడు జట్టు ద్వితీయ బహుమతులు సాధించాయి. వాలీబాల్ బాలురు విభాగంలో నూజివీడు క్యాంపస్ ప్రథమ, శ్రీకాకుళం జట్టు ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నాయి. చెస్ పోటీల్లో బాలురు, బాలికల కేటగిరీలో శ్రీకాకుళం క్యాంపస్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. అంతర వర్సిటీ పోటీల్లో విజేతలైన ఈ క్రీడాకారులు కాకినాడ జేఎన్‌టీయూలో నిర్వహించనున్న సౌత్‌జోన్ బాలుర వాలీబాల్ పోటీలు, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ (తమిళనాడు)లో నిర్వహించనున్న బాలికల వాలీబాల్ పోటీల్లో పాల్గొంటారు. విజేతలకు క్యాంపస్ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏవో ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ శివరామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు, పీడీలు దిలీప్‌కుమార్, కృష్ణంరాజు పాల్గొన్నారు.



వాలీబాల్ ఆడుతున్న దృశ్యం



విజేతలతో డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ

సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం

(ఐదో పేజీ తరువాయి)

అధికారులతో చర్చించామని, అవసరమైన చోట్ల కొత్త షట్టర్లు ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఇరిగేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేసి.. శివారు ప్రాంతా లకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యేలు గొండు శంకర్, గౌతు శిరీష, కూన రవికుమార్, వంశధార ప్రాజెక్టు, నారాయణపురం ఆనకట్ట చైర్మ న్‌లు అరవల రవీంద్రబాబు, సనపల ఢిల్లీరావు, ఆర్డీవోలు సాయిప్ర త్యూష, కృష్ణమూర్తి, వంశధార డిప్యూటీ కలెక్టర్ జయదేవి, ఇరిగేషన్ ఎస్ఈ సుధాకర్, ఈఈలు, నీటి సంఘాల చైర్మన్లు పాల్గొన్నారు.

హోంగార్డుల సేవలు కీలకం

(ఐదో పేజీ తరువాయి)

చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పరేడ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పరేడ్ కమాండర్, ప్లాటూన్ కమాండర్, సిబ్బందికి మెడల్స్‌ను బహుకరించారు. పదవీ విరమణ పొందిన హోంగార్డు రమణ మూర్తికి.. (జిల్లాలో హోంగార్డుల ఒక రోజు గౌరవ వేతనాన్ని) రూ. 4.18 లక్షలు ఆర్థిక సహాయాన్ని ఎస్పీ అందజేశారు. ఏఎస్పీ పి.శ్రీని వాసరావు, డీఎస్పీ సీహెచ్ వివేకానంద, ఏఓ సీహెచ్ గోపీ నాథ్, సీఐలు ఇమ్మాన్యుయేల్ రాజు, పైడిపునాయుడు, ఈశ్వరరావు, అవతారం, సూర్యచంద్రమౌళి, సన్యాసినాయుడు, సత్యనారాయణ, ఆర్ఐలు నర్సింగరావు, కృష్ణప్రసాద్, ఆర్ఎస్ఐలు, రూరల్ ఎస్ఐ కె.రాము, సిబ్బంది పాల్గొన్నారు.

మూడు నెలలుగా డీఎస్పీ లేరు

(ఐదో పేజీ తరువాయి)

నియామకం జరిగిపోయేది. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించ డం లేదు. డీఎస్పీ వి.వెంకటఅప్పారావును రాష్ట్ర ప్రభుత్వం డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేయడంతో మూడు నెలల నుంచి ఆ పోస్టు ను భర్తీ చేయలేదు. కాశీబుగ్గ సబ్ డివిజన్‌లో పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాలు ఉన్నాయి. నిత్యం రోడ్డు ప్రమా దాలు, రాజకీయ గొడవలు ఉంటాయి. దీనికితోడు ఒడిశా సరిహద్దు కావడంతో గంజాయి, సారా రవాణా యధేచ్ఛగా కొనసాగుతుంది. అన్నింటికి మించి మావో యిస్టు ప్రభావిత గ్రామాలు కావడంతో సున్నితమైన అంశాలను చక్కదిద్దడానికి ఎస్‌డీపీఓ తప్పనిసరిగా ఉండాలి. ఇటీవల కార్తీక ఏకాదశి సందర్భంగా చిన్న తిరుమలగా పిలుచుకునే కాశీబుగ్గ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో తొమ్మిదిమంది భక్తులు ప్రాణాలు కోల్పోయిన విషయం విధితమే. సరైన అధికారి లేకపోవడంతో పర్యవేక్షణ కొరవడింది. దీంతో విలువైన భక్తుల ప్రాణాలు గాలిలో కలసిపోయాయి. డీఎస్పీ స్థాయి అధికారి ఇక్కడే ఉండిఉంటే ఇటువంటి సంఘటనలు జరిగినా సకాలంలో స్పందించి నియంత్రించేందుకు అవకాశం ఉండేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

- గతంలో కాశీబుగ్గ కేంద్రంగా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాల యం ఉండేది. దీన్ని పరిపాలన సౌలభ్యం కోసం టెక్కలికి తరలించా రు. కొత్తగా టెక్కలి సబ్‌డివిజన్ పోలీసు కార్యాలయం ఏర్పాటు కావ డంతో కాశీబుగ్గ వైపు నాయకులు, అధికారులు చూడడం మానేశారు. ఎక్సైజ్ కార్యాలయం లాగే సబ్‌డివిజన్ పోలీసు కార్యాలయాన్ని శాశ్వ తంగా తొలగిస్తారనే ఊహాగానాలు జోరందుకున్నాయి. దీనిపై స్థాని కంగా ఉన్న ఏ అధికారిని ప్రశ్నిస్తున్నా పైఅధికారులు, ప్రభుత్వ ఆదేశాల మేరకే జరుగుతాయని, తొందరలోనే డీఎస్పీని నియమిస్తారని చెబుతున్నారు.

అధికారులూ.. రికార్డులు చూసుకోరా?

- నదుల అనుసంధానానికి ఎంత భూమి పెండింగ్ ఉంది?
- ఇటువంటి వారితో పని చేయలేం
- పీయూసీ చైర్మన్ కూన రవి ఆగ్రహం



జలవనరుల శాఖ అధికారులకు దండం పెడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

శ్రీకాకుళం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): 'అధికారులూ.. రికార్డులు చూసుకోరా..? నిన్న పంపించిన రిపోర్టు... ఈ రోజు గుర్తు లేదంటే ఎట్లా..?' అని పీయూసీ చైర్మన్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రశ్నించారు. జిల్లా పరిషత్‌లో శనివారం జరిగిన 'నీటి పారుదల సలహా మండలి సమావేశం'లో జల వనరుల శాఖ అధికారుల తీరుపై రవికుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను అడిగిన ప్రశ్నలకు సరైన జవాబు లభించకపోవడంతో 'ఇటువంటి అధికారులతో ఏమీ చేయలేం. ఇటీవల రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపిన సమాచారం కూడా ఒక్కరోజులో గుర్తు లేదంటే ఏమనాలి?' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నాగావళి-వంశధారల అనుసంధానానికి భూసేకరణకు గాను ఇంకా ఎంత పెండింగ్ ఉంది' అని ముందుగా సమావేశంలో రవికుమార్ అధికారులను అడిగారు. ఈ విషయమై సరైన సమాధానం లభించలేదు. 'అధికారులే పాత రికార్డులు చూసుకోకుంటే ఎలా..? నేను వీరితో ఎలా పని చేయించుకోగలను..? వీరికే సమాచారం తెలియకపోతే ఎలా?' అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై అధికారులు కూడా మౌనంగానే ఉండిపోయారు. ఎమ్మెల్యే రవికుమార్ ఇంకా మాట్లాడుతూ వంశధార షట్టర్ల కుంభకోణంపై చర్యలు ఉండాలని కోరారు. అధికారులు సరిగ్గా పని చేయడం లేదని... 22ఎల్ కాలువ వల్ల ఆమదాలవలసలో ఓ కాలనీలోకి నీరు చేరుతోందని చెప్పారు. 'నేనూ ఇంజనీర్‌నే. మీరు చెప్పింది వినేందుకు ఇక్కడలేను.

సాగునీరు ఇవ్వగలరా?

వంశధార రిజర్వాయర్‌లో ప్రస్తుతం నీరు ఎంత నిల్వ ఉంది..? మార్చి నెలకు పనులు పూర్తి చేసి సాగు నీరు ఇవ్వగలరా?' అని ఎమ్మెల్యే రవికుమార్ నిలదీశారు. తాను సమావేశాలకు అధ్యయనం చేసి వస్తానని.. అధికారులు మాత్రం చదవకుండా వచ్చేస్తున్నారని చెప్పారు. ఇంజనీరింగ్ అధికారులు వేర్వేరు చోట్ల ఉంటున్నారని.. దీనివల్ల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని చెప్పారు. నారాయణపురం ఆనకట్టకు ఫీల్డ్ ఛానల్స్ వద్ద షట్టర్లు లేవని.. ఇక మున్సిపాలిటీల్లో ఉన్న కాలువల ద్వారా వచ్చే మురుగునీరు, చెత్త సాగునీటి కాలువల్లోకి రాకుండా చూడాలని చెప్పారు. సాగునీటి పరంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

17 ఏళ్లుగా పరిష్కరించలేదు..

శ్రీకాకుళం నియోజకవర్గంలో ఉన్న సాగునీటి సమస్యను పదిహేడేళ్ల నుంచి పరిష్కరించలేదు. వయోడెక్ట్ వల్ల నీరు నిండి కింద పడుతోంది. 37ఈ కాలువ సమస్యను ఇంతవరకు పరిష్కరించలేదు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలి.

-గొండు శంకర్, ఎమ్మెల్యే, శ్రీకాకుళం

3 నెలలకోసారి అప్‌డేట్ ఇవ్వండి..

సాగునీటి ప్రాజెక్టుల అంశంపై ప్రతి మూడు నెలలకు మీడియా ద్వారా జిల్లా ప్రజలకు, రైతాంగానికి సమాచారం చేరవేసేలా అప్‌డేట్ ఇస్తుంటే బాగుంటుందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష సూచించారు. అప్పటి తాజా పరిస్థితిని.. ప్రాజెక్టులు, తీసుకున్న చర్యలను వివరించాలని కోరారు. ఆఫ్‌షోర్ ప్రాజెక్టుపై లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని నెలవారీగా పూర్తిచేయాలని వివరించారు.

-గౌతు శిరీష, ఎమ్మెల్యే, పలాస

కంటతడి పెట్టించిన 'అమ్మ చెక్కిన బొమ్మ'

పాత శ్రీకాకుళం, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): 'సృష్టిలో ఉత్తమమైనది మానవజన్మ. ఇక్కడ ప్రతి ఒక్కరినీ గౌరవించాలి' అని 'అమ్మ చెక్కిన బొమ్మ' నాటిక చాటిచెప్పింది. శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు -2025లలో భాగంగా రెండో రోజు శనివారం ఈ నాటికను ప్రదర్శించారు. జ్యోతి రాజు భీశెట్టి రచించిన ఈ నాటికకు గోవాడ వెంకట్ దర్శకత్వం వహించారు. పురాణ కాలం నుంచి నేటి వరకూ రకరకాల శరీర తత్వాలు కలిగిన మనుషులు సమాజంలో ఉన్నారని.. అందరినీ సమానంగా చూడాలని ఈ నాటిక ద్వారా రచయిత చెప్పారు. హిజ్రా బిడ్డగా ఉన్న భర్తకు దూరంగా ఉంటూ పడే వేదనను కళ్లకు కట్టారు. ఇది కంటతడి పెట్టించింది. అనంతరం 'ఎవరు' అనే నాటికను కళాకారులు ప్రదర్శించారు. ఓ కుటుంబంలోకి అనాథ వెళితే జరిగిన పరిణామాలే ఈ నాటిక ఇతివృత్తం. అనంతరం జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు పాల్గొన్నారు. చల్లా శ్రీనివాసరావు, అంబటి శ్రీనివాసరావు, గార ఎంపీపీ గొండు రఘురాం, మూకళ్ల తాతబాబు, రంగస్థల కళాకారుల సమాఖ్య గౌరవ అధ్యక్షులు ఎల్.రామలింగస్వామి, సత్యవతి పాల్గొన్నారు.





అమ్మ చెక్కిన బొమ్మ నాటికలోని దృశ్యాలు

గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలి

● విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

జి.సిగడాం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అందరూ ఐక్యంగా ఉండి గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. శనివారం మండల కేంద్రంలో నియోజకవర్గ టీడీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని తద్వారా పార్టీ విజయానికి సహకరించేలా అవగాహన కలిగించాలన్నారు. 2047 నాటికి రాష్ట్రాన్ని దేశంలో అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో నిలిపేలా సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. అభివృద్ధికి మారుపేరు టీడీపీ అని అన్నారు. నిత్యం ప్రజల్లో ఉండి వారి సమస్యలు తెలుసు కుని వాటి పరిష్కారానికి పాటుపడాలన్నారు. బజారువీధిలో పిన్నింటి భాస్కరరావు సొంత నిధులతో ఏర్పాటు చేయనున్న ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, ప్రధాన కార్యదర్శి కుదిరెళ్ల బుజ్జి, పీఏసీఎస్ అధ్యక్షుడు బెవర జగన్నాథరావు, రైల్వే జోనల్ బోర్డు సభ్యుడు బాలబొమ్మ వెంకటేశ్వరరావు, నాయకులు టంకాలమౌళీశ్వరరావు, మజ్జి కన్నంనాయుడు, కంచరాన సూరన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి విరాళాలివ్వండి: మంత్రి అచ్చెన్న



విరాళం అందిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): దేశ రక్షణలో అశువులు బాసిన, విధి నిర్వహణలో గాయపడిన మాజీ సైనికులు, వారి కుటుంబాల సంక్షేమానికి ఉద్దేశించిన సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి ఉదారంగా విరాళాలు అందించాలని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కోరారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి శైలజతో కలిసి పిలుపునిచ్చారు. సాయుధ దళాల పతాక దినోత్సవ ఫ్లెక్సీని ఆవిష్కరించారు. ఆయనతో పాటు ఎమ్మెల్యేలు కూన రవి కుమార్, గొండు శంకర్, గౌతు శిరీష, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తమవంతు విరాళాలు అందజేశారు.

నామమాత్రంగా మండల సమావేశం

కంచిలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దేవదాస్ రెడ్డి అధ్యక్షతన శనివారం జరిగిన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నామమాత్రంగా జరిగింది. ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపీడీవో తిరుమలరావు, తహసీల్దార్ ఎన్.రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. పలు శాఖలకు చెందిన అధికారులు శాఖల పనితీరును వివరించగా పౌర సరఫరాలు, ఇరిగేషన్, హౌసింగ్ సమస్యలపై పలువురు సభ్యులు ప్రశ్నలు వేశారు. భైరిపురం పంచాయతీ పరిధిలో రేషన్ సరుకుల పంపిణీ సక్రమంగా జరగడం లేదని, శాసనాం పంచాయతీలో లో వోల్టేజీ సమస్య ఉందని, కొల్లూరు పంచాయతీలో పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని సభ్యులు కోరారు.

యూరియా సరఫరాలో వైఫల్యం

జి.సిగడాం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందని సర్పంచ్‌లు బుడారి లక్ష్మణరావు, వడిశ మహేష్, తొత్తడి రామారావు, కంది రమాదేవి, ఎంపీటీసీ సభ్యులు కుమరాపు రమేష్‌నాయుడు, కీర్తి తౌడమ్మ తదితరులు విమర్శించారు. ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీపీ మీసాల సత్యవతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖపై జరిగిన చర్చలో వారు మాట్లాడుతూ.. రైతులు పంటలను వేసి ఎరువుల కోసం ఎదురు చూసినా ఫలితం లేకపోవడంపై అధికారులను నిలదీశారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, ఎంపీడీవో జి.రామ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలి

రణస్థలం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రణస్థలం సీహెచ్‌సీ పరిధిలో కిడ్నీ రోగులు ఎక్కువగా నమోదవుతున్నందున కిడ్నీ డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని పలువురు సభ్యులు కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ పిన్నింటి రజని అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఎరువులు సరఫరా చేయాలని కోరారు. ప్రత్యేకాహ్వానితుడు సాయికుమార్, ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు, ఏడీఏ వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోలీస్ శిక్షణ కేంద్రాన్ని పరిశీలించిన ఎస్పీ



శిక్షణా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఎంపికైన స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్ల శిక్షణ (ఎస్‌సీటీపీసీ) త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో శనివారం శ్రీకాకుళం రూరల్ మండలం తండేంవలసలో జిల్లా పోలీసు శిక్షణ కేంద్రాన్ని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పరిశీలించారు. శిక్షణ కేంద్రంలోని మైదానం, తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్, బ్యారెక్స్, తాగునీటి సరఫరా, మెస్, భోజనశాల, స్నానాల గదులను పరిశీలిం చారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పోలీస్ కానిస్టేబుల్ శిక్షణ త్వరలో ప్రారంభంకానున్నందున మౌలిక వసతులను మెరుగుపరచాలన్నారు. శిక్షణకు అవసరమయ్యే అన్ని వసతులు సిద్ధం చేయాలని సంబంధిత అధి కారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ పి.శ్రీనివాస రావు, డీఎస్పీ వివేకానంద, సీఐలు పైడిపు నాయుడు, ఇమ్మాన్యుల్‌రాజు, ఈశ్వరరావు, అవతారం, కృష్ణమూర్తి, ఆర్ఐ లు, రూరల్ ఎస్ఐ కె.రాము తదితరులు పాల్గొన్నారు.

హైందవ ధర్మాన్ని పరిరక్షించాలి



మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ క్షేత్ర ప్రచారక్

రణస్థలం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే గొప్ప చరిత్ర కలిగిన హైందవ ధర్మాన్ని, సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించాలని ఆర్ఎస్ఎస్ క్షేత్ర ప్రచారక్ భరత్ కుమార్ అన్నారు. శనివారం నడుకుదిటి పాలేం ఎన్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రాంగణంలో నడుకుదిటి తేజ అధ్యక్షతన హిందూ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా భరత్ కుమార్ మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎక్కడా లేని ఆచార సంప్రదాయాలు, గౌరవాలు దేశంలో ఉన్నాయని ఇది హిందూ ధర్మ ప్రత్యేకత అన్నారు. మహిళలను గౌరవించే పుణ్యభూమి భారతదేశ మన్నారు. ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు మాట్లాడుతూ.. రామాయణ, భారత, భాగవతాలు మనిషి జీవితానికి అన్వయించి ఉన్నాయని, వాటిని తెలుసు కోవడం ద్వారా ఎలా బతకాలో తెలుస్తుందన్నారు. శ్రీనివాసానంద స్వామి మాట్లాడుతూ హైందవ ధర్మాన్ని రక్షించేందుకే ఆర్ఎస్ఎస్ ఉద్భవించిందన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

రణస్థలం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి అనుమతి పత్రాలు లేని ఎరువులు విక్రయిస్తే తక్షణం నిలిపివేయాలని టెక్కలి ఇంటర్నల్ స్క్వాడ్ డివిజన్ సహాయ సంచాలకుడు కె.జగన్మోహన్‌రావు స్పష్టం చేశారు. శనివారం కోష్ట, జేఆర్‌పురంలలో మూడు ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓ ఫామ్‌లో నమోదు కాని మూడు షాపుల నిల్వలు కలిపి రూ.6.15 లక్షల విలువైన ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో డి.విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

దళారుల బారినపడి మోసపోకండి: అశోక్



ధాన్యం ట్రాక్టర్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్

సోంపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ధాన్యం సేకరణ విషయంలో రైతులు దళారుల బారిన పడి మోసపోవద్దని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. వ్యవసాయశాఖ కార్యాలయంలో శనివారం ధాన్యం సేకరణ కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రతీ ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేసి 24 గంటల్లోగా నగదును రైతుల ఖాతాల్లో జమచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏవో బి.నరసింహమూర్తి, తహసీల్దార్ బి.అప్పలస్వామి, నేతలు మద్దిల నాగేశ్వరరావు, చిత్రాడ శ్రీనివాసరావు, బిన్నల జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పనే ధ్యేయం

కవిటి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. కవిటిలో ఎస్‌వీజే కళాశాలలో శనివారం స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. జాబ్‌మేళాలను ఉపయోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా 162 మంది యువతీ, యువకులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ యు.సాయికుమార్, కళాశాల సిబ్బంది, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్‌కు అభినందన

ఇచ్ఛాపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన కొండా శంకర్ రెడ్డికి బెల్లుపడ గ్రామంలో టీడీపీ పట్టణ నాయకులు శనివారం అభినందించారు. ఆయనను శాలువలు, బొకేలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు పత్రి తవిటయ్య, నందిగాం కోటి, కౌన్సిలర్లు ఆశి లీలా రాణి, జి.శేఖర్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కాళ్ల జయదేవ్, అంగన్‌వాడీ సంఘం అధ్యక్షురాలు బి.హైమ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా భాస్కరరావు



భాస్కరరావు

ఎచ్చెర్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పౌర సరఫరాల జాతీయ ఆహార భద్రతా చట్టం-2013లో భాగంగా ఎఫ్‌పీ షాప్ లెవెల్ విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా రేషన్ డిపో డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు, ముద్దాడ డిపో డీలర్ వడగ భాస్కరరావు నియమితులయ్యారు. ఈ మేరకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని ఆయన తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కవిటి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బొరివంక సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వ్యవసాయ కనెక్షన్లకు సంబంధించి పనులు చేపడుతు న్నందున మాణిక్యపురం ఫీడర్ పరిధిలోని మాణిక్యపురం నుంచి ఒంటూరు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

అసిరయ్యకు సత్కారం

ఆమదాలవలస, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక బస్టాండ్ వద్ద ప్రముఖ జానపద కళాకారుడు (బుడబుడక్కులు) బోనెల అసిరయ్య జానపద గీతాలను ఆలపించారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ సత్కరించారు. ఇచ్చిన ప్రదర్శనలు, సినిమాల పరిచయాలు, బుడబుక్కల కళా రూపాలపై నివేదిక అందిస్తే సీఎం దృష్టికి తీసుకొని వెళ్లి అసిరయ్యను గౌరవిస్తామన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

● ఆలస్యంగా వెలుగులోకి..


అప్పారావు (ఫైల్)

లావేరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): చిగిరికొత్తపల్లికి చెందిన గిడుతూరి అప్పారావు (59) చెరువులో పడి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అప్పారావుకు గత కొన్నేళ్లుగా మతిస్థిమితం లేక బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో ఈ నెల 1న అప్పారావు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అప్పటి నుంచి అతడి కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం చిగిరికొత్తపల్లి పక్కనే ఉన్న చెరువు సమీప పొలాల్లో రైతులు వ్యవసాయ పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆ ప్రాంతంలో భరించలేని దుర్వాసన వస్తుండడంతో వారంతా అటుగా వెళ్లి పరిశీలించారు. దీంతో అప్పారావు మృతదేహం ఆ చెరువులో తేలియాడుతూ ఉండడాన్ని గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. అప్పారావుకి భార్య చిన్నమ్మడుతో పాటు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వీరందరికీ వివాహాలయ్యాయి. కుమారుడు సూరప్పడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్‌ఐ ప్రసాద్ తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

సారవకోట(జలుమూరు), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అలుదు గ్రామానికి చెందిన కొరాయి శంకరరావు (54) శుక్రవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శంకరరావు శుక్రవారం సాయంత్రం మద్యం తాగేందుకు తన భార్యను డబ్బులు అడిగారు. ఆమె లేవని చెప్పడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన శంకరరావు శుక్రవారం రాత్రి ఉరివేసుకున్నాడు. కుటంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు


గాయపడిన సోమేశ్వరరావు

పాతపట్నం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పాతపట్నం పరిధి కాకితోట సమీపంలో రైలు ఢీకొన్న ఘటనలో బొమ్మాళి సోమేశ్వరరావు తీవ్రంగా గాయపడిన ఘటన శనివారం చోటుచేసుకొంది. స్థానికులు తెలిపి న వివరాల మేరకు.. పట్టణ పరిధి రెల్లివీధికి చెందిన సోమేశ్వరరావు పట్టాలు దాటుతుండగా గుణుపూర్ నుంచి పూరి వెళుతున్న ఎక్స్‌ప్రెస్ ట్రైన్ ఢీకొనడంతో ఎడమకాలు పాదం కట్ అయిపోగా, కుడిచేయికి విరిగిపోయాయి. గాయప డిన సోమేశ్వరరావును 108 సిబ్బంది స్థానిక సీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

మోడల్ స్కూల్ విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు

కంచిలి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎంఎస్ పల్లి మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని శుక్రవారం సాయంత్రం నుంచి కనిపించలేదని ఆ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, వార్డెన్ పొందూరు రమ్య శనివారం కంచిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కళాశాల హాస్టల్‌లో ఉండి చదువుతున్న విద్యార్థిని శుక్రవారం సాయంత్రం కళాశాల విడిచిపెట్టిన తరువాత స్నేహితులతో కలిసి బయటకు వెళ్లింది. రాత్రయినా తిరిగి రాకపోవడంతో ప్రిన్సిపాల్, సిబ్బంది సమీప ప్రాంతాల్లో గాలించారు. ఆమె స్నేహితులను విచారించగా, ఎవరికీ తెలియదని చెప్పడంతో సమాచారాన్ని విద్యార్థిని తల్లిదండ్రులకు తెలిపారు. శుక్రవారం సాయంత్రం విద్యార్థిని, కంచిలి రైల్వే స్టేషన్ వద్ద కనిపించినట్లు కొందరు చెప్పినట్టు సమాచారం. శనివారం విద్యార్థిని కుటుంబ సభ్యులతో కలిసి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పారినాయుడు తెలిపారు.

అరుదైన జాతికి చెందిన పాము మృతి



పలాసరూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జనావాసాలకు దూరంగా, గుబురైన పొదల్లో సంచరించే అత్యంత విషపూరితమైన ఓ అరుదైన జాతికి చెందిన పాము మృతి చెందింది. పెదంచల గ్రామ పరిధి పెదచెరువు వద్ద శనివారం గుబురుగా ఉన్న పొదల నుంచి కింగ్‌కోబ్రా జాతికి చెందిన బాండెడ్ క్రైట్ (చారలు కలిగిన) అనే పాము రోడ్డుపైకి వచ్చింది. ఈ క్రమంలో ఏదో ఒక వాహనం దానిపై నుంచి వెళ్లడంతో మృతి చెందింది. అత్యంత విషపూరితమైన ఇటువంటి పాములు పొలాలు, గుబురైన ప్రాంతాల్లో సంచరిస్తుంటాయని స్నేక్‌క్యాచర్ ఓంకార్ తెలిపారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నందున్న రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో తనిఖీలు



కాంప్లెక్స్‌లోని షాపులను తనిఖీ చేస్తున్న పోలీసులు

నరసన్నపేట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పోలీసులు నిఘా పెట్టారు. శనివారం డాగ్ స్కాడ్‌తో నరసన్నపేట ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పార్శిల్ కేంద్రంలో తనిఖీ చేపట్టారు. అలాగే షాపులు, బస్సుల్లో ప్రయాణం చేసేవారి బ్యాగ్‌లను పరిశీలించారు. ఇటీవల డ్రోన్ కెమెరాలతో నిఘా పెంచిన పోలీసులు రెండు రోజులు వ్యవధిలో డాగ్ స్కాడ్‌తో విస్తృత తనిఖీలు చేపట్టారు.

హిందువులంతా ఐక్యంగా ఉండాలి

నరసన్నపేట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాజకీయాలు, కులాలకు అతీతంగా హిందువులంతా ఐక్యంగా ఉండాలని ఆర్ఎస్ఎస్ దక్షిణ మధ్య క్షేత్ర ప్రచారక్ భరత్ కుమార్ అన్నారు. శనివారం స్థానిక ఎన్జీవో హోంలో ఆర్ఎస్ఎస్ వందేళ్ల ప్రయాణంలో దేశవిజయగాధలను గుర్తుచేయడంతో పాటు హిందూసమాజంపై గౌరవభావం పెంచేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హిందూ సమాజాన్ని చైతన్యపరుస్తూ, మన దేశాన్ని విశ్వగురువుగా నిర్మాణం చేయాలనే లక్ష్యంతోనే ఆర్ఎస్ఎస్ 1952లో ప్రారంభించబడిందన్నారు. కార్యక్రమంలో వైద్యులు గొలివి మోహనరావు, ప్రతినిధులు ఉన్న సోమేశ్వరరావు, బంకుపల్లి సుమబాల, పద్మరాజు బాలకృష్ణ పాల్గొన్నారు.

ఆందోళన చెందవద్దు

పాతపట్నం రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రైతులు ఆందోళన చెందవద్దని తహసీల్దార్ ఎన్.ప్రసాదరావు అన్నారు. శనివారం మండలంలోని బైదిలాపురం రైస్‌మిల్లును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు గ్యారెంటీ పూర్తయ్యిందని, రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. అంతేకాక రైతులు ఆందోళన చెందొద్దని తూనికలు, కొలతల్లో ఎటువంటి అవకతవకలు జరగవని, మిల్లర్లు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఏవో సింహాచలం, వీహెచ్‌ఏ దుక్క శరత్‌రెడ్డిలు ఉన్నారు.

అంబేద్కర్ సేవలు చిరస్మరణీయం


నరసన్నపేట: కాణిపాకంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


ఆమదాలవలస: ఆర్టీసీ బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్ తదితరులు


పాతపట్నం: కోర్టు కూడలిలో టీడీపీ శ్రేణులు..


జి.సిగడాం: మండల కేంద్రంలోని ఎస్సీవీధిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు అన్నారు. శనివారం అంబేడ్కర్ వర్థంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన అందించిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు.

- ఆంధ్రజ్యోతి బృందం


పలాస: మునిసిపల్ కార్యాలయంలో..


శ్రీకాకుళం లీగల్: బార్ అసోసియేషన్ హాల్‌లో..


హిరమండలం: బ్యారేజీ సెంటర్‌లో గల అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జడ్పీటీసీ బుచ్చిబాబు

వరుస దొంగతనాలు.. ఛేదించిన పోలీసులు

● నాలుగు చోరీ కేసుల్లో వ్యక్తి అరెస్టు

● 78 గ్రాముల బంగారం, 38 గ్రాముల వెండి, నగదు స్వాధీనం

టెక్కలి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): టెక్కలి పరిధిలో ఇటీవల వరుసగా జరుగుతున్న దొంగతనాల కేసులను పోలీసులు ఛేదించారు. ఈ కేసులకు సంబంధించిన వ్యక్తిని శనివారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ విజయ్‌కుమార్ తన కార్యాలయంలో వెల్లడించారు. వరుసగా దొంగతనాలకు పాల్పడుతున్న బెనియా జగబందు అలియాస్ పోతురాజును స్థానిక నౌపడా-మెళియాపుట్టి రోడ్డు ఫ్లైఓవర్ కింద పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. ఇతడి నుంచి 78.205 గ్రాముల బంగారు ఆభరణాలు, 38 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.10వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. టెక్కలి పరిధిలో ఇటీవల జరిగిన నాలుగు చోరీ కేసుల్లో బెనియా జగబందు నిందితుడిగా ఉన్నాడు. గతంలో కూడా జగబందు అనేక కేసుల్లో అరెస్టయ్యాడు. నిందితుడ్ని కోర్టులో హాజరుపరచగా.. న్యాయాధికారి రిమాండ్ విధించినట్టు సీఐ తెలిపారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ విజయ్‌కుమార్

తైక్వాండో క్రీడాకారులకు అభినందన


క్రీడాకారులను అభినందిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ క్రీడా వికాస్ కేంద్రం నుంచి వివిధ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించిన తైక్వాండో క్రీడాకారులను శనివారం మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అభినందించారు. అలాగే తైక్వాండో క్రీడా కోటాలో మెడిసిన్ సీటు సాధించిన జాశ్వికను మంత్రి అభినందించారు. రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించిన పడాల అభిషేక్, మెండ తపశ్వి, అట్టాడ మహీదర్‌నాయుడు జాతీయస్థాయి పోటీల్లో రాణించాలని ఆకాంక్షించి కోచ్ శేఖర్‌ను అభినందించారు.

క్లస్టర్ విధానాన్ని విరమించాలి

కవిటి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో స్కూల్ కాంప్లెక్స్‌లను ఎ, బి క్లస్టర్ ప్రతిపాదిత విధానాన్ని విరమించాలని సీఎంఆర్టీలు కోరారు. ఈ మేరకు రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు శని వారం సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అధికారులకు వినతిపత్రాలు అందించారు. సీఎంఆర్టీలందరికీ ఒకే విధమైన హోదా, పని కల్పించాలన్నారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. 2016లో ఆమోదించిన వేతనాలనే నేటికీ ఇస్తున్నారని, పెరిగిన ధరలతో కుటుంబ పోషణ భారంగా మారింద న్నారు. వేతనాలను పెంచాలన్నారు. సీఎంఆర్టీలను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ ఉద్యోగులుగా పరిగణించాల కోరారు. సీఎంఆర్టీలు ఎస్.తనూజ, తులసీరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

అధికంగా రసాయన ఎరువులు వాడొద్దు

పాతపట్నం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సూచనలకు మించి రసాయన ఎరువులు వాడొద్దని ఏవో కె.సింహాచలం తెలిపారు. పాతపట్నం, బూరగాం గ్రామాల్లో సాగు అవుతున్న మొక్కజొన్న పంటను శనివారం క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. సుమారు 400 ఎకరాల్లో మొక్కజొన్న సాగు అవుతుందని, వీటిలో ఎక్కువగా కాండం తొలిచేపురుగు ఆశిస్తున్నట్టు గుర్తించామన్నారు. వీటి నివారణకు ఎనామిక్టిన్ బెంజోయేట్ 80గ్రాములు, వేపనూనె 500ఎంఎల్ తీసుకొని 200లీటర్ల మంచి నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎఇఒలు రైతాంగం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మెళియాపుట్టి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రెడ్డి బజార్ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్దపద్మాపురం గ్రామానికి చెందిన ఎన్ని హరికృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్వగ్రామం నుంచి ద్విచక్రవాహనంప మెళియాపుట్టి వస్తుండగా ఓ వ్యక్తి అడ్డంగా రావడంతో అతడ్ని తప్పించబోయిన ప్రమాదానికి గురయ్యాడు. గాయపడిన హరికృష్ణను స్థానిక పీహెచ్‌సీకి తరలించగా.. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమయంగా ఉండడంతో 108 వాహనంలో టెక్కలి జిల్లా అసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు.

ఎరువుల దుకాణాల తనిఖీ


ఎరువుల గోదాం పరిశీలిస్తున్న దృశ్యం

పోలాకి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువుల దుకాణాలను వ్యవసాయశాఖ ఏడీ బగ్గు రజని శనివారం తనిఖీ చేశారు. పోలాకి, పిన్నింటిపేట, బెలమర తదితర గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను సందర్శించి, రికార్డులు, ఎరువుల నిల్వలు పరిశీలించారు. రైతుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎరువులు అధిక ధరలకు విక్రయించొద్దన్నారు. ఆమె వెంట ఏవో చిరంజీవి, ఎరువుల వ్యాపారులు ఉన్నారు.

వైభవంగా గాయత్రి జ్ఞానమహాయజ్ఞం


యజ్ఞంలో పాల్గొన్న మాజీ మంత్రి గౌతు దంపతులు

మందస, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం మందసలో శనివారం 108 కలశాలతో గాయత్రి జ్ఞాన మహాయజ్ఞం వైభవంగా నిర్వహించారు. మందస పట్టణంలో ఈ గాయత్రి జ్ఞాన మహాయజ్ఞాన్ని నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో గాయత్రి తీర్థశాంతి కుండ్, హరిద్వార్ తత్వధాన్ విధానంలో గత రెండు రోజులుగా కార్యక్రమాలు చేపట్టారు. మాజీ మంత్రి గౌతు శ్యామ సుందర శివాజీ దంపతులు పాల్గొన్నారు. ఆదివారం సామూహిక గాయత్రి జపం, గాయత్రి జ్ఞానమహాయజ్ఞం, పూర్ణాహుతి, అన్న ప్రసాద కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

అర్హులందరికీ సరుకులు అందించాలి

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో నష్టపోయిన మత్స్యకారులందరికీ రేషన్ సరుకులు అందించాలని జిల్లా సివిల్ సప్లై అధికారి సూర్యప్రకాశరావు అన్నారు. శనివారం ఆయన డోకులపాడు, గుణుపల్లి రేషన్ డిపో కేంద్రాలను పరిశీలించారు. రెండురోజుల్లో సరుకులు అందిరికీ అందించేలా చర్యలు చేపట్టాలని మండల సివిల్ సప్లై డీటీ రామారావును ఆదేశించారు. రేషన్ డిపో పుస్తకాలు, గోదాములను పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక డీలర్లు, విఆర్‌ఓలు ఉన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం

హరిపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మందస మండల యూటీఎఫ్ శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు ఆ సంఘ జిల్లా కార్యదర్శి, ఎన్నికల అధికారి గున్న రమేష్ తెలిపారు. మందస హైస్కూల్ ఆవరణలో శనివారం నిర్వహించిన ఈ ఎన్నికల్లో గౌరవ అధ్యక్షుడిగా జన్ని సోమేశ్వరరావు, అధ్యక్షుడిగా జగదీష్ బడిత్య, ప్రధాన కార్యదర్శిగా దాసరి ఈశ్వరరావు, కోశాధికారిగా శిష్టు సోమనాథ్‌తోపాటు మరికొంతమంది సభ్యులను ఎన్నుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రాజాన పరమేశ్వరరావు, జయరాం మాలి, కొర్ల తేజేశ్వరరావు, కొండలరావు, సోమేశ్వరరావు, ఎస్.రజని పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయాలి

నందిగాం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విశాఖలో ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు జరిగే సీఐటీయూ అఖిలభారత మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా రైస్, ఆయిల్ మిల్లర్ల కార్మికుల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి హెచ్.ఈశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి కొల్లి ఎల్లయ్యలు కోరారు. శనివారం మండలం పెంటూరులో మహాసభలకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సనపల గోవిందరావు, కార్యదర్శిగా పి.కోటేశ్వరరావు, గౌరవాధ్యక్షులుగా ఎస్.అప్పారావు, ఉపాధ్యక్షులుగా ఆఫీస్, దుర్యోధనతో పాటు మరో పదిమంది కార్యవర్గ సభ్యుల్ని ఎన్నుకున్నారు.

పక్కాగా మెనూ అమలు చేయాలి

మందస, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నిబంధనల ప్రకారం మెనూ అమలు చేసి బాలికలకు అందజేయాలని రాష్ట్రగిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కమల సూచించారు. ఆమె శనివారం మందస మండలంలో పర్యటించారు. బుడంబో ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఏటీడబ్ల్యూవో ఎం.మల్లికార్జునరావు పాల్గొన్నారు.

నేడు ఎన్ఎంఎంఎస్ పరీక్ష

పలాసరూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పలాస డివిజన్‌లో ఆదివారం 8 కేంద్రాల్లో ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్) పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. మొత్తం డివిజన్‌లో 1712మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. పలాస గవర్నమెంట్ హైస్కూల్,ఎస్ఎఫ్ఎస్ స్కూల్, జడ్పీ హెచ్ఎస్ స్కూల్, కాశీబుగ్గ, శ్రీచైతన్య స్కూల్, కాశీబుగ్గ, నారాయణ హైస్కూల్, కాశీబుగ్గ, భాష్యం స్కూల్, గురుకుల స్కూల్, గవర్నమెంట్ కాలేజీ, పలాసలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకూ పరీక్షలు జరుగుతాయన్నారు.

విద్యార్థులను మందలించిన బాలికల తల్లిదండ్రులు

● కాలేజీ బస్సును అడ్డుకుని..

ఆమదాలవలస, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కళాశాల బస్సులో ఇబ్బందులకు గురిచేస్తున్న విద్యార్థులను విద్యార్థినుల తల్లిదండ్రుల మందలించిన ఘటన శనివారం సాయంత్రం పట్టణంలో చోటుచేసుకుంది. శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రైవేటు కార్పొరేట్ కళాశాల బస్సు ఆమదాలవలసకు నిత్యం వస్తుంటుంది. ఈ బస్సులో విద్యార్థిని, విద్యార్థులు శ్రీకాకుళం వెళ్లి చదువుకుని వస్తుంటారు. అయితే బస్సులో వచ్చే సమయంలో కొందరు విద్యార్థులు పలు రకాలా ఇబ్బందులు పెడుతున్నారని బాలికలు తమ తల్లిదండ్రులకు చెప్పారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం బస్సును కొత్తకోటవారివీధి సమీపంలో బాలికల తల్లిదండ్రులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో సుమారు గంటపాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. బస్సులో ఉన్న పలువురు యువకులను మందలించి భవిష్యత్‌లో ప్రవర్తన మార్చుకోకుంటే కళాశాల యాజమాన్యానికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. విద్యార్థులపై దాడి చేయకుండా యాజమాన్యానికి ఫిర్యాదు చేయాలని, బస్సు నిలపడం వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతాయని డ్రైవర్ పేర్కొనడంతో బాలికల తల్లిదండ్రులు బస్సును విడిచిపెట్టారు.

ఆడ పిల్లలను సంరక్షించుకుందాం

నరసన్నపేట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలను చదివించడంతో పాటు వారి స్వీయరక్షణకు తగిన జాగ్రత్తలను ఉపాధ్యాయులు తెలియజేయాలని శక్తి టీం సభ్యులు గిరిధర్, యశోద, ద్రాక్షాయిణి సూచించారు. శనివారం స్థానిక ఎంఎల్ఆర్ నాయుడు డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాజంలో ఆడపిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలు ఎలా ఎదుర్కోవాలో వివరించారు. అత్యవసర సమయంలో 100, 1098, 181, 112 హెల్ప్‌లైన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు. శక్తి యాప్, సైబర్ నేరాలపై అవగాహన చేపట్టారు. కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

వివక్ష లేని సమాజం నిర్మిద్దాం

హరిపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): వివక్షత లేని సమాజం నిర్మిద్దామని ఏపీఎం పి.కూర్మారావు అన్నారు. మందస మండలం బిన్నల, హరిపురం, సువర్ణాపురం, ఉమాగిరి గ్రామాల్లో శనివారం డ్వాక్రా మహిళల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు మీనాక్షి, రాములమ్మ, ముఖలింగం, చంద్రిక, కరుణశ్రీ, అను, కేశమ్మ పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్‌తో సామాజిక బాధ్యత

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో సామాజిక బాధ్యత పెరుగుతుందని ఎన్ఎస్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ వనజా అన్నారు. గోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరాన్ని శనివారం ఆమె సందర్శించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్‌కుమార్ పట్నాయిక్ ఉన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

సంతబొమ్మాళి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): దండు గోపాలపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు కోత మహలక్ష్మి అప్పన్న మెమోరియల్ సర్వీస్ ఆర్గనైజేషన్ శనివారం అందజేశారు. పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ చూపిన చుక్క సమగ్నకు రూ.6వేలు, వంజరాపు మనోజ్‌కుమార్‌కు రూ.5వేలు, నక్కల నవదీప్‌కు రూ.4వేలు చొప్పున్న అందజేశారు. బాలికల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన గౌడు షన్ముఖప్రియకు రూ.5వేలు, గాలి నవ్యశ్రీకు రూ.4వేలు, వాడరేవు తరుణ్‌కుమార్‌కు రూ.3వేలు చొప్పున్న అందజేశారు. సబ్జెక్టుల్లో ఎక్కువ మార్కులు సాధించిన పంగ మనోజ్‌కుమార్‌కు రూ.5 వేలు, బెండి కామేశ్వరరావుకు రూ.4 వేలు, కర్రి యోగానంద్‌కు రూ.3వేలు చొప్పున్న అందజేశారు.

మొక్కుబడిగా మండల సమావేశం

టెక్కలి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం మొక్కుబడిగా సాగింది. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన సమావేశం కోరం లేక వాయిదాపడింది. మధ్యాహ్నం 2.30 గంటలకు తిరిగి సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ వార్షిక బడ్జెట్‌ను సభ్యులకు వివరించారు. పలు శాఖల అధికారులు గైర్హాజరు కావడంతో మండల పరిషత్ సమావేశం మొక్కుబడిగా సాగింది. ఈ సమావేశంలో ఎంపీపీ అట్ల సరోజినమ్మ, ఏఎంసీ చైర్మన్ బగాది శేషగిరి, ఎంపీడీవో మొజ్జాడ రేణుక తదితరులు ఉన్నారు.

నేడు యూటీఎఫ్ సమావేశం

మెళియాపుట్టి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): చాపరలో యూటీఎఫ్ జిల్లా మహాసభ నిర్వహించనున్నట్టు అంకడాల లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమానికి పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు హాజరు కానున్నట్టు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలపై తీర్మానాలతోపాటు భవిష్యత్ కార్యాచరణపై చర్చించిస్తామని ఉపాధ్యాయులంతా హాజరవ్వాలన్నారు.

● కోటబొమ్మాళి: మెళియాపుట్టిలో ఆదివారం జరగనున్న యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి గొండు నారాయణరావు కోరారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సమావేశానికి సంబంధిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

యూటీఎఫ్ అధ్యక్షుడిగా పాపారావు

టెక్కలి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ టెక్కలి మండల అధ్యక్షుడిగా డొంకాన పాపారావు, ప్రధాన కార్యదర్శిగా దవళ లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు. శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడిగా అరుణ్‌కుమార్, సహాధ్యక్షులుగా గణపతిరావు, ప్రభావతి, ఆడిట్‌కమిటీ సభ్యులుగా సత్య నారాయణ, కోశాధికారిగా రుషి ఎన్నికయ్యారు. ఎన్ని కల అధికారిగా కె.దాలయ్య, పరిశీలకులుగా శంకరరావు వ్యవహరించారు.

ఫిర్యాదు చేయండి

మెళియాపుట్టి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగితే ఫిర్యాదు చేయాలని ఎంజీ ఎన్ఆర్‌జీఎస్ జిల్లా సోషల్ ఆడిటర్ వెంకట్ తెలిపారు. గతంలో జరిగిన ఉపాధి పనుల ఆడిట్ శనివారం రట్టిణిలో గ్రామసభను నిర్వహించారు. ఏఎంసీ డైరెక్టర్ ప్రశాంత్, ఈసీ ఆదినాయరాణ రెడ్డి ఉన్నారు.